# తృప్తి

కామేశ్వరి


మా రత్నకుమారి ఈ రోజు ఎందుకో చాలా కామ్‌గా తనపనిచేసుకుపోతోంది. ఎప్పుడూ ఏదో ఒకటి బడబడ మాట్లాడుతూ సందడిగా ఉండే రత్నకి ఏమయిందో నాకర్థం కాలేదు.

కాఫీ ఇస్తున్నప్పుడు దాని మొహంలోకి పరిశీలనగా చూసాను. మొహంలో కోపచ్ఛాయలు లేవు, కాని, ఎడ తెగని ఆలోచనతో సతమతమవుతున్నట్లుగా, అశాంతిగా ఉన్నట్లులోచింది.

అందుకే ఇంక ఉండబట్టలేక 'ఏమిటే రత్నా అలా ఉన్నావు?' అని అడిగాను అంతే. అగ్ని పర్వతం ప్రబద్దలయినట్లుగా 'ఏముందమ్మా ఆముదనట్టపోడు మరలదాపురించాడు. ఈ పదిహేనేళ్ళ నుండి నా ఊసు, పిల్లాడి ఊసు అక్కర్లేక పోయింది ఇప్పుడు నేనూ నా పిల్లాడు కావాలని వచ్చాడు' అంది ఈసడింపుగా. నేను కొంచెం కుతూహలంగా 'మరేం చేస్తావు' అని ప్రశ్నించాను.

'ఏం చేయడమమ్మా? మా అమ్మ, అన్న, నా ప్రాణం తోడేస్తున్నారు. వాడి తప్పువాడికి తెలిసిందిగా! వాడితోనే ఉండు అని. కాని నాకు వాడిమీద ఏమాత్రం ప్రేమలేదమ్మా, అవల యిన వయసంతా 'అడవి కాచిన వెన్నెల'యిపోయింది. ఇంక ఇప్పుడెందుకమ్మా ఈ లేనిపోని గొడవ అంటున్న రత్నను, 'అది కాదే నీకోసం కాదు. నీ పిల్లాడికి, తండ్రి ముచ్చట కూడా తీరినట్లుంది కదా అని నసుగుతున్న నావయిపు, తీవ్రంగా ఓసారి చూసి 'ఏమిటమ్మా మీరు కూడా మావాళ్ళలాగే చెప్తున్నారు?' పదువుకుని. కథలు గట్టా రాసే మీరే అలా అంటే ఇంక మా వాళ్ళనెందుకు అనుకోవడం, మీరూ అంతే'. 'తండ్రి ముచ్చటంట, తండ్రి ముచ్చట', నా కొడుకు పుట్టి రెన్నెలకే నన్ను విడిచి వేరే వాళ్లను తగులుకొని వెళ్ళిపోయాడే ఆ రోజునుండి ఈ రోజు వరకు నా కొడుక్కి ఏలోటురానిచ్చానమ్మా? తల్లినయినందుకు వాడిగురించి మీ అందరిళ్ళలో పాచిపనిచేసుకుని వాడికి చదువు చెప్పిస్తున్నాను. వాడిక్కావలసినవి కొంటున్నాను. ఇంక వాడికి వాడి తండ్రి ఏముచ్చట తీరుస్తాడమ్మా.

ఈ పదో క్లాసు అయిపోతే వాడే తీరుస్తాడు కన్నవారి ముచ్చట్లు అని ఝుణ ఝుణ లాడించి 'ఏమనుకోకమ్మా నా మనసేమి బాగోలేదు. రేపు వాడికి ఏ సంగతి చెప్పాల, బుర్రంతా పిచ్చిపట్టినట్లుండి ఏదో వాగాను, పట్టించుకోకమ్మా అంటూ, వెళ్ళొస్తానమ్మా అని వేగంగా వెళ్లిపోయింది. అది వెళ్లిపోయినా దాని మాటలు నా మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి. అది చెప్పిందీ నిజమే! నెల పిల్లాడ్ని పదిహేనేళ్ల కుర్రాడిగా చేయటానికి అది ఎంత తాపత్రయ



పడిందో అంతా కాకున్నా గత పదేళ్ళుగా తనకు తెలుసు. ఒళ్ళు వంచి కష్టపడి పదిళ్ళలో పనిచేసుకుంటూ అద్దె గదిలో ఉంటూ, పిల్లాడిని చూసుకుంటూ ఎన్నాళ్ళు గడిపితే ఇన్నాళ్లయ్యేము అన్నీ తెలుసుండీ తను అలా అనకుండా ఉండాల్సింది. ఎంత రచనలు చేసినా చిన్నప్పటి నుండి నరనరాన ఇంజక్టు చేయబడిన ఈ సాంప్రదాయాల విషం ఎక్కడికి పోతుంది?' ఇలాగే నోటమ్మట మాటల రూపంలో వస్తుంది అని నన్ను నేనే తిట్టుకున్నాను.

సొంత కష్టమ్మీద బీరువా కుర్చీలు, ఫాను, మిక్సీ ఇలా చిన్నచిన్న ఫర్నిచర్స్ సెకండ్ హాండ్ ధరలకి కొని కొడుకుకి అన్ని సదుపాయాలు కూర్చుకొని నలుగురిలో మంచి పేరు తెచ్చుకున్న రత్నం ఏం చేస్తుందో రేపటిదాకా వేచిచూడాలి అనుకుంటూ ఆలోచనల్లో కొనసాగిపోయాను.

ఎలాగో తెల్లారింది. రత్న రాకకోసం ఆత్రంగా ఎదురుచూసాను. ఎలాగో రానేవచ్చింది రత్న. వస్తూ మామూలుగా ఎప్పట్లా హుషారుగా తను చూసొచ్చిన సినిమాల గురించి, ఎదురింటి వనజాక్షి గురించి గడగడ వాగేస్తోంది. నాకు మనస్సులో 'ఏం జరిగిందో తెలుసుకోవాలన్న కుతూహలం, ఇంక అణుచుకోలేక ఏమని చెప్పావే రత్నా మీ ఆయనకి' అనడిగాను మెల్లగా దానికి జవాబుగా రత్న గలగలనవ్వేస్తూ 'మీరడుగుతారని నాకు తెలుసమ్మా' కాని మీకు నమ్మద్దో లేదో కాని వాడిని మేము వదిలేసాము! మేము అంటే నేను నాకొడుకు అని గర్వంగా తనవయిపు చూపెట్టుకుంటూ.

'నీ కొడుకుకి తెలుసా ఈ గొడవ అన్నాను' విభ్రాంతిగా. 'తెలియకుండా ఎలా ఉంటుందమ్మా?' 'నిన్న నేనేవాడిని పిలిచి చెప్పినా! నాకయితే ఇష్టం లేదు మరినువ్వేమంటావు అని అడిగా, దానికి వాడు చెప్పిన జవాబు ఏమనుకొన్నావు. నాకు తల్లీ తండ్రి అన్నీ నువ్వే నాకు ఏనాన్న వద్దు చిన్నప్పటి నుండి తండ్రి లేని వాడిలాగే పెరిగాను. ఇప్పుడూ అంతే. అన్నాడమ్మా. మా అమ్మ, అన్న కూడా చెప్పి చూసారు కాని వాడు వినలేదమ్మా. వాడు ఎంతయినా నాకొడుకమ్మా నా కొడుకు' అంది గుండెలమీద చెయ్యివేసుకుంటూ. 'మరి అతను' అన్నాను సందేహంగా ఇంకేం అతను? వల్లకాట్లో రామనాథయ్య మొహం ముడుచుకొని వెళ్లిపోయాడమ్మా! వాడిమొహం చూడాలి. వెళ్ళేప్పుడూ..." అని ఏం గుర్తొచ్చిందో పడీపడీ నవ్వసాగింది. నవ్వుతున్న ఆకళ్ళలో తనకిష్టంలేని పని చేయక్కర్లేదన్న తృప్తి కన్పిస్తోంది. ○

ఉదయం వారపత్రిక